నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 17 అక్టోబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

కమిటీలదే ఖిచెయి

ఎంపికపై రాజకీయం!

అలవికాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్.. అమలు చేయలేక పది నెలలు గడిచింది. అడపాదడపా ప్రవేశపెట్టిన పథకాలే అనేక కొర్రీలతో అసంపూర్ణంగా మారగా.. ఇందిరమ్మ ఇండ్ల పేరిట మరో కొత్త మోసానికి తెరలేపింది. నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేస్తూ ఇందులో ప్రముఖంగా కాంగ్రెస్ నాయకులనే కమిటీ సభ్యులుగా తీసుకుంటూ అక్రమాలకు ఆజ్యం పోస్తున్నది. కాగా, కమిటీల ఎంపికలో పలు చోట్ల కాంగ్రెస్ నేతల మధ్యే పోటాపోటీ నెలకొన్నది. వనపర్తిలో మేఘారెడ్డి, చిన్నారెడ్డి.., గద్వాలలో బండ్ల, సరిత వేర్వేరుగా లిస్టులు రూపొందించి అధికారులకు ఇచ్చారు. అలంపూర్‌లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే విజయుడు ఉన్నప్పటికీ.. సంపత్‌కుమార్ లిస్టును తీసుకోవాలని అధికారులకు హుకుం జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల స్కీంలో అనేక అక్రమాలు చోటు చేసుకోగా.. కొత్తగా మరోసారి కుచ్చుటోపీ పెట్టి దోపిడీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నదనే విమర్శలు లబ్ధిదారుల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

- పంచాయతీ, బల్దియాల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు
- ఐదుగురు సభ్యుల నియామకంపై సందేహాలు
- కాంగ్రెస్ కార్యకర్తలకే అధిక ప్రాధాన్యత
- నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు
- ఎమ్మెల్యేల సిఫారసులతోనే ఎంపిక
- పారదర్శకతపై వ్యక్తమవుతున్న అనుమానాలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నా.. హస్తం పార్టీ మాజీలదే హవా
- ఉమ్మడి జిల్లాలోని లబ్ధిదారుల్లో మొదలైన ఆందోళన

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు, ఇతరులకు రూ.5 లక్షల చొప్పున మూడు విడుతలుగా ఆర్థిక సాయం అందించనున్నది. ఇందులో భాగంగా గ్రామాలు, మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను నియమించేందుకు ఈనెల 11న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలాల నుంచి ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు ఈ జాబితాను కలెక్టర్ ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో ప్రభుత్వానికి చేరవేయాల్సి ఉంటుంది. కమిటీల్లో ఏడుగురు సభ్యులుగా ఉంటారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచులు లేక పోవడంతో ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్ చైర్మన్‌గా, వార్డు అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మిగిలిన ఐదుగురు సభ్యుల్లో ఇద్దరు మహిళా సంఘం నుంచి, మరో ముగ్గురు ఎస్సీ, ఎస్టీ, బీసీ వంటి గ్రామ పెద్దలు సభ్యులుగా ఉంటారు. ఈ సభ్యుల ను సాధారణంగా అధికారులు నియమించాల్సి ఉండగా, అనధికారికంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇచ్చిన పేర్లను పొందుపర్చనున్నట్లుగా తెలుస్తోంది. దీనివల్ల ఇందిరమ్మ ఇండ్ల పథకంలో రాజకీయ ప్రమేయం ప్రత్యక్షంగా చూపించే అవకాశం ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 464 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీల్లోని 86 వార్డుల్లో కమిటీలను నియమించనున్నారు. కాగా, జాబితాను ఎంపిక చేయాల్సిన అధికారులు ఎమ్మెల్యేల నుంచి అందే పేర్ల కోసం ఎదురు చూస్తున్నారు. తాము పేర్లను తయారు చేస్తే ఎందుకు సమస్యలను ఎదుర్కోవాలనే భావనలో ఎంపీడీవోలు, మున్సిపల్ చైర్మన్లు ఉన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం లక్షలాది మంది దరఖాస్తుచేసుకోగా, సభ్యుల నియామకంలో రాజకీయ జోక్యం వల్ల అర్హుల ఎంపిక లో పారదర్శకత లోపిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై నాగర్‌కర్నూల్ ఎంపీడీవో రామ్మోహన్‌ను వివరణ కోరగా.. గ్రామ కమిటీల ఎంపిక కార్యాచరణ ప్రారంభించామని, వీలైనంత త్వరలో జాబితాను రూపొందిస్తామన్నారు.

మహబూబ్‌నగర్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. ఆరు గ్యారెంటీల్లో ఏ పథకం కూడా పూర్తి స్థాయిలో అమలు చేయకపోగా, కొత్తగా ఇందిరమ్మ ఇండ్ల పేరిట ప్రజలను మరోసారి బురిడీ కొట్టించేందుకు సమాయత్తమవుతున్నది. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేస్తూ కాంగ్రెస్ సర్కార్ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 12 నియోజకవర్గాల్లో 42వేల ఇండ్లు మంజూరు కానున్నాయి. అయితే ఇక్కడే అసలైన మెలికే పెట్టింది. పూర్తి స్థాయిలో లబ్ధిదారుల ఎంపికలు ఇందిరమ్మ కమిటీలతో నిర్వహించాలని నిర్ణయించింది. కాంగ్రెస్ నాయకులను ఈ కమిటీల్లో నియమించి తమ కార్యకర్తలకు ఇల్లు దక్కేలా ప్లాన్ రెడీ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు ఎమ్మెల్యేలు సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కమిటీల ఎంపిక నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 454 గ్రామ పంచాయతీలకు ఇప్పటి వరకు కేవలం 150 గ్రామపంచాయతీలకు మాత్రమే కమిటీలను ఎంపిక చేశారు. మిగతా చోట్ల కమిటీల ఎంపిక జరుగుతోంది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 49 వార్డులకు సగం వార్డులను ఎంపిక చేశారు. భూత్పూర్, జడ్చర్ల మున్సిపాలిటీలో కమిటీల ఎంపిక సాగుతోంది.

మొత్తం కాంగ్రెస్ సభ్యులే..

ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడంలో కాంగ్రెస్ నాయకులు ఉండడం విమర్శలకు తావిస్తున్నది. అధికారులను ఉత్సవ విగ్రహాలుగా పెట్టి మొత్తం కమిటీ సభ్యులతో ఎంపిక ప్రక్రియ చేయించాలని సదరు ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నారు. మంచి పట్టున్న కాంగ్రెస్ నేతలను సభ్యులుగా తీసుకోవాలని ఎమ్మెల్యేలు సిఫార్సు చేస్తున్నారు. కాగా, అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే విజయుడు ఉండగా, మాజీ ఎమ్మెల్యే సంతప్‌కు మాల్ చెప్పినట్లు వినాలని కాంగ్రెస్ నేతలు అధికారులకు హుకూం జారీ చేశారు. పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్యకర్తల ప్రమేయంతో రాజకీయ జోక్యం చేసుకోవడంపై విమర్శలకు తావిస్తున్నది.

గ్రామ సభలో ఎంపిక చేయాలి..

ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో గ్రామ సభల్లో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి. గతంలో ఇందిరమ్మ ఇల్లు కేటాయించి అనేక అక్రమాలకు పాల్పడ్డారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ నాయకులను కమిటీలో చేర్చి పాత పరిస్థితే తీసుకురావొద్దు. రాజకీయ జోక్యం ద్వారా అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుంది. లేదంటే బీఆర్ఎస్ తరపున ఆందోళన చేపడుతాం.

- చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే

బస్సులో బంగారం చోరీ

తాడూరు, అక్టోబర్ 16 : నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన పాలాది శ్రీదేవి బుధవారం ఉదయం నాగర్‌కర్నూల్ నుంచి కల్వకుర్తికి వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. హైదరాబాద్‌లోని తమ బంధువుల ఫంక్షన్‌కు వెళ్లడానికి 3ఉంగరాలు (తులంన్నర), నల్లపూసల దండ (తులంన్నర), రెండు తులాలన్నర నెక్లెస్, కమ్మల బుట్టాలు తులంన్నర మొత్తం 9తులాల బంగారాన్ని ఒక బ్యాగులో పెట్టుకుని వెళ్తుండగా గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. కొల్లాపూర్‌గేట్ సమీపంలో బ్యాగును పరిశీలించగా, కనిపించలేదు. దీంతో కండక్టర్, డ్రైవర్ తాడూరు పోలీస్‌స్టేషన్ ఎదుట బస్సు ఆపి ప్రయాణికులను తీసుకెళ్లి పోలీసులు తనిఖీ చేశారు. ఎవరి దగ్గరా బంగారం కనిపించకపోవడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో విచారిస్తానని పోలీసులు తెలిపారు.

పోటాపోటీగా లిస్టులు

- వనపర్తి జిల్లాలో రెండు వర్గాల ప్రతిపాదనలు
- తలలు బాదుకుంటున్న అధికారులు
- కమిటీలో కాంగ్రెస్ కార్యకర్తలు • ప్రతిపక్షాల ఫైర్

వనపర్తి, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : వనపర్తి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలకు రెండు వర్గాల నుంచి వేర్వేరుగా పేర్లను ప్రతిపాదించడం చర్చనీయాంశమైంది. జిల్లా పరిధిలో 255 గ్రామ పంచాయతీలుండగా, ఐదు మున్సిపాలిటీలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలో 7 మండలాలు జిల్లా ఘనపురం, గోపాల్‌పేట, పెద్దమందడి, పెబ్బేరు, శ్రీరంగాపురం, రేవల్లి, వనపర్తి ఉండగా, రెండు మున్సిపాలిటీలు పెబ్బేరు, వనపర్తి ఉన్నాయి. ఇందిరమ్మ కమిటీల ప్రతిపాదనలో ఎమ్మెల్యే మేఘారెడ్డి వర్గం, అలాగే రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వర్గాలు వేర్వేరుగా పేర్లను ప్రతిపాదించినట్లు సమాచారం. ప్రధానంగా ఎమ్మెల్యే వర్గం కొంత ముందు వరుసలో ఉండగా, చిన్నారెడ్డి వర్గం సైతం తమకు పట్టున్న గ్రామాల్లో పేర్లను అధికారులకు ప్రతిపాదించడం చర్చనీయాంశమైంది. శ్రీరంగాపూర్ మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో రెండు వర్గాల ప్రతిపాదనలు అందించారు. అలాగే పెద్దమందడిలోనూ అధిక గ్రామాల నుంచి రెండు లిస్టులు అధికారులకు చేరాయి. ఇక మిగిలిన గోపాల్‌పేట, రేవల్లి, పెబ్బేరు మండలాల్లో కూడా సగం జీపీల నుంచి పోటా పోటీగా లిస్టులను పంపినట్లు చెబుతున్నారు. వనపర్తి, జిల్లా ఘనపురం మండలాల నుంచి ఎమ్మెల్యే వర్గం వారే పేర్ల లిస్టులను పంపినట్లు తెలిసింది. ఇక మున్సిపాలిటీలకు సంబంధించి పెబ్బేరు, వనపర్తిలలో ఎమ్మెల్యే వర్గమే పేర్లను ప్రతిపాదించినట్లు సమాచారం.

పాలుపోని అధికారులు..

అసెంబ్లీ ఎన్నికల నుంచి వనపర్తి నియోజకవర్గంలో రెండు వర్గాలు తమదే పైచేయి అంటే.. కాదు తమదే పైచేయి అన్నట్లుగా కొనసాగుతున్నాయి. ఎవరికి వారు తగ్గేదేలేదన్నట్లుగా వ్యవహారం సాగుతున్నది. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి వేర్వేరుగానే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎప్పుడో ఒక సారి కలిసి కార్యక్రమంలో పాల్గొన్నా అంటీముట్టనట్లుగానే ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఇందిరమ్మ ఇండ్ల కమిటీల్లోనూ పోటా పోటీగా వేర్వేరుగా ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో అధికారులు ఏం చేయాలతో పాలుపోక తలలుపట్టుకుంటున్నారు. కాగా, ఇందిరమ్మ ఇండ్ల కమిటీల్లో కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని మాత్రమే ప్రతిపాదిస్తున్నారని, నిబంధనలను పట్టించుకోవడం లేదని ప్రతిపక్షాల నాయకులు చెబుతున్నారు.

కమిటీలపై గందరగోళం

గద్వాల, అక్టోబర్ 16 : జోగులాంబ గద్వాల జిల్లాలో ఇందిరమ్మ కమిటీల ఎంపికలో కాంగ్రెస్ నాయకుల మధ్య కుమ్ములాటమొదలైంది. రాజకీయ జోక్యానికి ఆస్కారం ఉండడంతో కమిటీల ఏర్పాటుపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న చోట ఎటువంటి ఇబ్బందులు లేకున్నా ఓడిపోయిన చోట, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలస వచ్చిన ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో రెండు వర్గాలుగా జాబితాలు తీసుకొని కలెక్టర్‌కు పంపిస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే విజయుడు, కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచి ఓడిపోయిన సంపత్‌కుమార్ మధ్య వార్ నడుస్తున్నట్లు తెలిసింది. ఇద్దరు కూడా జాబితాలు తయారు చేసి ఎంపీడీవో, కమిషనర్లకు అందజేశారు. దీంతో అధికారులు ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండలంలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచి ఓడిపోయిన సరిత వర్గం కూడా కమిటీలకు సంబంధించి ఇద్దరూ వేర్వేరుగా జాబితా ఇచ్చినట్లు తెలిసింది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో కమిటీలే కీలక పాత్ర పోషిస్తుండడంతో ప్రాధాన్యత సంతరించుకున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లల్లో అనేక అక్రమాలు చోటుచేసుకోవడంతో గత ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేసింది. జిల్లాలో 255 జీపీలతోపాటు నాలుగు బల్దియాల్లో 77 వార్డులున్నాయి.

బ్యాంక్ అధికారులే.. సూత్రదారులు?

నవ భారతి పట్టణ మహిళా సమాఖ్య వద్ద కూర్చొని లెక్కలేసుకుంటున్న మహిళలు

- కవరింగ్ లెటర్లు, కమిషనర్ సంతకాలు లేకుండానే బ్యాంక్ లింకేజీ రుణాలు
- కనీస విచారణ లేకుండా రూ.లక్షలు తారుమారు
- మున్సిపల్ కమిషనర్‌కు తుది నివేదిక అందించిన మెప్మా అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 16 : మహబూబ్‌నగర్ మెప్మా పరిధిలోని మహిళా స్వయం సహాయక బృందాల నిధుల గోల్‌మాల్‌లో బ్యాంక్ అధికారులే సూత్రధారులు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరులో చోటుచేసుకున్న అంశాలు ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తున్నాయి. కోయనగర్‌లోని సాయి స్లమ్ సమాఖ్యలోని అంబిక, స్ఫూర్తి, మాధవి, బృంద, సాయిమణంత మహిళా స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన బ్యాంక్ లింకేజీ రుణాలు కమిషనర్ సంతకం, కవరింగ్ లెటర్లు లేకుండానే బ్యాంక్ అధికారులు ఒక్కో సంఘానికి రూ.10లక్షలు చొప్పున రూ.50లక్షల వరకు రుణాలు మంజూరు చేశారు.

బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరు చేయాలంటే..

మహిళా సంఘాల్లోని సభ్యులకు బ్యాంక్ లింకేజీ కింద రూ.10లక్షల రుణం ఇవ్వాలంటే ప్రధానంగా సూక్ష్మ రుణ ప్రణాళిక (ఎంసీపీ) అవసరం. ఈ ఎంసీపీలో పొందుపర్చిన అంశాల ఆధారంగా ఆన్‌లైన్ ఎంసీపీ జనరేట్ చేస్తారు. కమ్యూనిటీ ఆర్గనైజర్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ సంతకాలు, మున్సిపల్ కమిషనర్ లేదా మెప్మా పీడీ సంతకం, కవరింగ్ లెటర్లు కచ్చితంగా ఉండాల్సిందే. వీటన్నింటినీ బ్యాంక్‌లో సబ్మిట్ చేశాక.. ఫీల్డ్ అధికారి సంఘంలోని 10 మంది సభ్యులతో నేరుగా మాట్లాడి.. ఇది వాస్తవమేనా? కాదా? అందరి ఆమోదం మేరకే బ్యాంక్ లింకేజీ రుణాలు కోరుతున్నారా? అనే తీర్మానం మేరకు ఆ సంఘం ఖాతాలో రూ.10లక్షలు డబ్బులు జమ చేయాలి. వీటిని ఆ సంఘం మహిళలు వ్యక్తిగత ఖాతాల్లోకి లేదా నేరుగా డబ్బులు డ్రా చేసుకోవాలన్నా.. బ్యాంకు మేనేజర్‌కు తీర్మానం కాపీ అందించాల్సి ఉంటుంది. ఇవేవీ లేకుండానే నేరుగా రూ.10లక్షలు మహిళా సంఘాల ఖాతాల్లోకి జమచేయడం, వాటిని ఇతర సంఘాలు, వ్యక్తుల ఖాతాల్లోకి మళ్లించడంపై బ్యాంక్ అధికారులే సూత్రధారులనే అనుమానాలకు బలం చేకూర్చుతోంది.

సాయి స్లమ్ సమాఖ్యలో నిధుల గోల్‌మాల్ ఇలా..

మెప్మా పరిధిలోని సాయి స్లమ్ సమాఖ్యలో మొత్తం 33 సంఘాలున్నాయి. వీటి పరిధిలో మొత్తం రూ.1.49 కోట్లు నిధులు గోల్ మాల్ అయ్యాయి. చిన్న సంఘాల పొదుపుల నుంచి రూ.29,04,024లు దుర్వినియోగం చేశారు. బ్యాంక్ లింకేజీ రుణాలు రూ.85,55,514లు సంఘాల పేరుతో పొంది ఇతర ఖాతాలకు మళ్లించారు. స్లమ్ సమాఖ్య పొదుపుల నుంచి రూ.6,52,360లు, స్త్రీ నిధి రుణాలు రూ.28,24,307లు దుర్వినియోగయ్యాయి. ఈ నిధుల దుర్వినియోగంలో బ్యాంక్ అధికారుల పాత్ర ఉందంటూ మున్సిపల్ అధికారులు ఎస్‌బీఐ రీజినల్ కార్యాలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీ, బ్యాంక్ ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే మహిళా సంఘాల సమస్యకు సత్వర పరిష్కారం లభిస్తుంది.

వితంతువుల పింఛన్ మాయం

- పంచాయతీ కార్యదర్శి, పోస్ట్ మాస్టర్ నిర్వాకం

గురుపాదమ్మ

నాగేశ్వరమ్మ

ఉండవెల్లి, అక్టోబర్ 16 : వితంతు పింఛన్ బాధిత మహిళలకు అందించకుండా ఎనిమిది నెలలుగా అధికారులు కాజేసిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం బొంకూరులో చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం.. బొంకూరుకు చెందిన గురుపాదమ్మ భర్త మంగళి వెంకట్రాముడు 2023 డిసెంబర్‌లో మృతిచెందాడు. నాగేశ్వరమ్మ భర్త బోయ మద్దిలేటి 2023లో మృతిచెందాడు. కిష్టమ్మ భర్త ఎనిమిది నెలల కిందట మృతిచెందాడు. ఈ ముగ్గురు వితంతువులకు ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ మంజూరు చేసింది. కాగా, పంచాయతీ కార్యదర్శి, పోస్ట్‌మాస్టర్‌తో కుమ్మక్కై 2024 ఫిబ్రవరి నుంచి పింఛన్ డబ్బులు డ్రా చేసినా లబ్ధిదారులకు ఇవ్వలేదు. పింఛన్ కోసం వితంతువులు ఎన్ని సార్లు అడిగినా రాలేదని చెబుతున్నారు. గురుపాదమ్మ పింఛన్ ఫిబ్రవరి నుంచి మే వరకు డ్రా చేసి జూన్ నుంచి ఇప్పటి వరకు బ్లాక్ లిస్ట్‌లో ఉంచారు. అలాగే నాగేశ్వరమ్మకు జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు పింఛన్ తీసుకున్నట్లు రికార్డులో ఉన్నా ఇచ్చింది ఒక నెల మాత్రమే. అలాగే కిష్టమ్మకు సంబంధించి జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు పింఛన్ డ్రా చేసినట్లు రికార్డులో నమోదైనా ఒక్క రూపాయి కూడా లబ్ధిదారుకు ఇవ్వలేదు. ఉన్నతాధికారులు స్పందించి పింఛన్ కాజేసిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి పింఛన్ కాజేసిన పంచాయతీ కార్యదర్శిపై, పోస్ట్ మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మన్ననూర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

అక్రమ కట్టడాల కూల్చివేత

అమ్రాబాద్, అక్టోబర్ 16 : అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్‌లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను బుధవారం అధికారులు కూల్చివేశారు. అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మెల్యే వంశీకృష్ణ హెచ్చరించిన అనతి కాలంలోనే అధికారులు చర్యలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. మన్ననూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా వ్యాపారం కోసం నిర్మించిన షెటర్లను తొలగించాలని అధికారులు నోటీసులు జారీ చేసినా తొలగించకపోవడంతో చర్యలు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి భీముడు తెలిపారు.

నియామకంపై హర్షం

- ఏషియన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టెక్నికల్ అధికారిగా రామ్మోహన్‌గౌడ్

ధన్వాడ, అక్టోబర్ 16 : బెంగళూర్‌లో 13వ అంతర్జాతీయ స్థాయి బాలికల ఏషియన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు కోరమాండల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. పోటీలకు ధన్వాడకు చెందిన పీఈటీ రామ్మోహన్‌గౌడ్ ఏషియల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టెక్నికల్ అధికారిగా నియమితులయ్యారు. ఎంపికకు సహకరించిన రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్ర మాదిత్యరెడ్డి, కోశాధికారి సోహెల్ రహెమాన్ ఖాన్, కార్యదర్శి ఖాజీ, కొండా పూల్ గిరి జవ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజరాంలకు రామ్మోహన్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ స్థులు హర్షం వ్యక్తం చేశారు.

మెడికల్ కళాశాలకు ఏర్పాట్లు చేయాలి

- హెచ్ఎఫ్‌డబ్ల్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనా జెడ్ చుంగ్తా

మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న క్రిస్టినా

నారాయణపేట, అక్టోబర్ 16 : నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు మెడికల్ కళాశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనా జెడ్ చుంగ్తా అధికారులను ఆదేశించారు. నారాయణపేట మండలం అప్పక్‌పల్లి శివారులో ఉన్న మెడికల్ కళాశాలను బుధవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో కేవలం ఫస్టియర్ తరగతులకు కావాల్సిన వసతులే కాకుండా సెకండియర్ తరగతులకు వసతి సౌకర్యాలు సమకూర్చుకోవాలన్నారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాలకు సంబంధించి ఏమేం అవసరమో వైద్య నిపుణులతో చర్చించారు. మెడికల్ కళాశాల మూడో అంతస్థులో బ్లడ్ బ్యాంక్, డయాలసిస్, ఇతర ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు పట్టణంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన, చిన్నపిల్లల దవాఖానను తనిఖీ చేశారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయం, ఎంసీహెచ్(మదర్ అండ్ చైల్డ్ హెల్త్) విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో టీజీ ఎంఐడీసీ ఎండీ హేమంత్, ట్రైనీ కలెక్టర్ గమీమనరుల, అకాడమిక్ డీ ఎంఈ శివరాంప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్, పాలమూరు మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేశ్, డీఎం హెచ్‌వో సౌభాగ్యలక్ష్మి, జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ మల్లికార్జున్ ఉన్నారు.

వంద పడకల దవాఖాన తనిఖీ..

జడ్చర్ల, అక్టోబర్ 16 : జడ్చర్ల పట్టణంలోని వంద పడకల ఏరియా దవాఖానను హెల్త్ సెక్రటరీ క్రిస్టీనా జెడ్ చుంగ్తా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె దవాఖానలోని ఓపీ, చిన్నపిల్లల వార్డులు, జనరల్ వార్డులు తోపాటు అన్ని విభాగాలను పరిశీలించారు.

కమ్మేసిన పొగమంచు

వేకువజామున పొగమంచు చూపరులకు ఎంతో మధురానుభూతిని పంచగా, వాహనదారులను మాత్రం తిప్పలు పెట్టింది. బుధవారం తెల్లవారుజామున హన్వాడలో ఉదయం 8గంటలైనా పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు లైట్ల వెలుతురులో ప్రయాణించాల్సి వచ్చింది. – హన్వాడ, అక్టోబర్ 16